
సాక్షి
గుంటూరు
7
ఆదివారం । 30 । మార్చి । 2025



కోదండరాముడిగా నృసింహుడు

మంగళగిరి టౌన్: ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి శనివారం కోదండరాముడిగా దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 521.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,088 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నేటి నుంచి వసంత నవరాత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)
గుంటూరు	6.25
నరసరావుపేట	6.27
బాపట్ల	6.25

న్యూస్‌రీల్

కొనసాగిన కేంద్ర బృందం పర్యటన



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్ళూరు ప్రాథమిక వైద్యశాలలో రెండవ రోజు శనివారం కేంద్ర బృందం పరిశీలన కొనసాగింది. బృందం సభ్యులు డాక్టర్ పరిమళ జగస్, డాక్టర్ భద్రకాంత్ శర్మలు ఎన్‌క్యూఎస్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు)లో భాగంగా కాన్పుల గది, అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్, ల్యాబ్ గదులు, నేషనల్ హెల్త్ కార్యక్రమాలు, జనరల్ మెయింట్‌నెన్స్ రికార్డులను పరిశీలించారు. అనంతరం బలుసుపాడు, జలాల్‌పురం గ్రామాల్లో పర్యటించి గ్రామ స్థాయిలో ఉప ఆరోగ్య కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పరిశీలించిన అంశాలపై చర్చించారు. మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు వెలిగొండరెడ్డి, ఆదిత్య, సూపర్‌వైజర్లు దిలీప్‌కుమార్, శ్రీనివాసరావు, సుభాషిణి, ధనలక్ష్మి, ఎంపీహెచ్‌ఎస్ విజయ్‌కుమార్, పీహెచ్‌ఎన్ దుర్గాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలులో 5.50 కిలోల గంజాయి స్వాధీనం



దాచేపల్లి: రైలులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జీఆర్పీ ఎస్‌ఐ వి.శ్రీనివాసరావు నాయక్ తెలిపారు. నడికుడి రైల్వేస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీన నహర్లగన్ నుంచి చర్లపల్లి వెళ్లుతున్న ప్రత్యేక రైలులోని ఏ1 ఏసీ కోచ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లుగా జీఆర్పీ పోలీసులకు సమాచారం అందిందన్నారు. పిడుగురాళ్ల ఆర్పీఎఫ్ పోలీసులతో పాటుగా నడికుడి జీఆర్పీ పోలీసులు ప్రత్యేక రైలుని నడికుడిలో ఆపి తనిఖీలు చేపట్టారని, ఏ1 ఏసీ కోచ్‌లో లైట్ స్కై బ్లూ రంగు ఉన్న బ్యాగ్‌లో 3 ప్యాకెట్లలో 5.50 కేజీల గంజాయి ఉన్నట్లుగా గుర్తించామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని సరఫరా చేసే నిందితుడి ఆచూకీ కోసం గాలించినా లభ్యంకాలేదన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు నాయక్ చెప్పారు. ఆర్పీఎఫ్ ఎస్‌ఐ హుస్సేన్, జీఆర్పీ రైటర్ సరికొండ రామరాజు, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రావు తదితరులున్నారు.

వైభవంగా అచ్చమ్మ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల



అచ్చంపేట: ఉగాది ఉత్సవాలలో భాగంగా గ్రామదేవతైన అచ్చమ్మ పేరంటాళ్లమ్మ దేవాలయంలో శనివారం రెండవరోజు తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి వేకువజామునే ప్రాతఃకాలపూలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేతపండితులు అమ్మవారికి వేదమంత్రోచ్చారణల నూతన వస్త్రాలంకరణ, కుంకుమ పూజ, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే లలిత సహస్రనామ పారాయణ చేశారు. మహానైవేద్య నివేదన, కర్పూర హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వివిధ గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు సూరే వెంకట సుబ్బారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తెనాలి కళారత్నాలు

'కళారత్న', ఉగాది పురస్కారాలకు తెనాలి నుంచి నలుగురు ఎంపిక



తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది రోజున వివిధ రంగాల్లో కృషి చేసిన ప్రముఖులకు బహూకరించనున్న 'కళారత్న', ఉగాది పురస్కారాలకు తెనాలి నుంచి నలుగురు ఎంపిక కావటం విశేషం. కళారంగం నుంచి ప్రముఖ శిల్పకారుడు కాటూరి వెంకటేశ్వరరావు, చిత్రకళలో రాయన గిరిధర్‌గౌడ్, బాలసాహిత్యంలో అలపర్తి వెంకట సుబ్బారావు, సాహిత్యంలో విహారి.. కళారత్న పురస్కారాలకు ఎంపిక కాగా, అత్తలూరి విజయలక్ష్మి సాహిత్యంలోనే ఉగాది పురస్కారం స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా వారి విశేషాలివి.

శిలాశాసనుడు కాటూరి



పట్టణానికి చెందిన ప్రముఖ శిల్పకారుడు కాటూరి వెంకటేశ్వరరావుకు వారసత్వంగా వస్తున్న శిల్పకళను కొనసాగిస్తున్నారు. సూర్య శిల్పశాలతో విగ్రహాల రూపకల్పనలో కొనసాగుతున్న కాటూరి వెంకటేశ్వరరావు ఆ వంశంలో ఆరోతరం వారు. ఏడో తరానికి చెందిన ఆయన ఇద్దరు కుమారులూ, వారసత్వంగా వస్తున్న శిల్పకళనే వృత్తిగా చేసుకోవటం విశేషం! వెంకటేశ్వరరావు తాత చంద్రయ్య సిమెంటు విగ్రహాలు, దేవాలయాల నిర్మాణం, దేవతా విగ్రహాలను తయారుచేసేవారు. తండ్రి కోటేశ్వరరావు రాజకీయ నేతల విగ్రహాలను కేవలం సిమెంటుతోనే చేసేవారు. వెంకటేశ్వరరావు ఆ విగ్రహాలతోనే ఆరంభించి, తన సృజనతో ఫైబర్, కాంస్య విగ్రహాల తయారీని ఆరంభించారు. కొడుకులు అందివచ్చాక నైపుణ్యం పెరిగింది.

'లేపాక్షి'కి పునరుజ్జీవం గిరిధర్‌గౌడ్



మరుగున పడిన విజయనగర చిత్రకళలోని లేపాక్షి శైలికి కొత్త మాధ్యమాల పోకడలను మేళవిస్తూ, నవ్యధోరణలను జోడిస్తూ విస్తృతంగా చిత్రీకరిస్తున్న ప్రముఖ చిత్రకారుడు రాయన గిరిధర్‌గౌడ్. ఆయన స్వస్థలం తెనాలి రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడి శివారు గరువుపాలెం. మైసూర్‌లో ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేశారు. బరోడాలో పీజీ చేశాక, అక్కడే సహాయ అధ్యాపకుడిగా పనిచేశారు. స్వస్థలానికి చేరుకుని మూడు దశాబ్దాలుగా చిత్రకళలో రకరకాల ప్రయోగాలు చేస్తూ భావాలకు రంగుల దృశ్యరూపం కల్పిస్తున్నారు. పద్మశ్రీ జగదీష్ మిట్టల్ సూచనలు, 'ట్రెడిషనల్ స్కూల్స్' సమాచారం తీసుకుంటూ మీనియేచర్ సహా విస్తృతమైన కాన్వాసుపై తనదైన పంథాలో చిత్రరచన చేస్తున్నారు. కొన్నేళ్లుగా లేపాక్షి చిత్రకళా శైలి పునరుజ్జీవానికి కృషిచేస్తున్నారు.

బాలసాహిత్యకారుడు 'అలపర్తి'



బాలసాహిత్యంలో ఆరు దశాబ్దాలకుపైగా కృషి చేస్తున్న రచయిత అలపర్తి వెంకట సుబ్బారావు. స్వస్థలం తెనాలి సమీపంలోని అంగలకుదురు. ప్రస్తుతం దుగ్గిరాలలో నివసిస్తున్నారు. చదివింది ఇంటర్ మాత్రమే. ఉపాధ్యాయుల ప్రేరణతో చిన్నవయసులోనే గేయాలు రాయటం అలవరచుకున్నారు. గేయాలు, గేయకథలు, కవితలు, కథలు రాస్తూ వచ్చారు. తన గేయాలు, గేయకథలుతో వచ్చిన తొలి పుస్తకం 'బాలానందం'. అప్పట్నుంచి పలు పుస్తకాలను తీసుకొచ్చారు. కేంద్ర సాహిత్య అకాడెమీ బాలసాహిత్య అవార్డును గతంలో స్వీకరించారు.

సాహితీ 'విహారి'



కళారత్నకు ఎంపికైన సాహితీమూర్తి విహారి. తెలుగు సాహితీ రంగంలో సుప్రసిద్ధమైన కలం. ఆయన కేవలం కథావిహారి మాత్రమే కాదు. పన్నెండు కథా సంకలనాలు, కథా విహారం, పరిచయాలు–పరామర్శలు శీర్షికలతో విమర్శకుడిగానూ ప్రసిద్ధులు. అసలు పేరు జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి. తెనాలిలో 1941 అక్టోబరు 15న జన్మించారు. కుటుంబ ఆర్థికస్థితితో ఎస్‌ఎస్‌ఎల్‌సీతోనే చదువు ఆగిపోయింది. చిరుద్యోగంతో ఆరంభించి, ప్రైవేటుగా చదివారు. 1962లో తొలికథ రాశారు. జీవిత బీమా సంస్థలో పనిచేస్తూ రచనా వ్యాసంగం కొనసాగిస్తూ, 12 కథా సంపుటాలు, ఏడు నవలలు, విమర్శనాత్మకమైన వ్యాస సంపుటాలు, సాహిత్య కదంబం, అయిదు కవితా సంపుటాలు, దీర్ఘ కథాకావ్యం పుస్తకాలు రాశారు. భాగవతంలోని పద్యాల్లో విహారి అనే పేరును కలం పేరుగా చేసుకున్నారు. తన రచనలపై వివిధ యూనివర్సిటీల్లో పరిశోధనలు జరిగాయి. 85 ఏళ్ల వయసులోనూ ఇప్పటికీ రచనలు చేస్తున్నారు. రాష్ట్ర సాహిత్య అకాడెమీ సహా పలు పురస్కారాలను అందుకున్నారు.

రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి



తెనాలికి చెందిన నాటక, కథా రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి. ప్రభుత్వ ఉద్యోగం కారణంగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి ఉగాది పురస్కారాన్ని ప్రకటించింది. నాటక రచనలు, వ్యంగ రచనలు, నవలలు రాశారు. ఉద్యోగం నుంచి రిటైరైనప్పటికీ రచనా వ్యాసంగం కొనసాగిస్తున్నారు.

మనోడే.. జీతం ఇచ్చేయండి !

- సస్పెండ్ అయిన కాలానికి ఉద్యోగికి జీతం
- ప్రస్తుత కమిషనర్ సస్పెన్షన్ ఎత్తివేత
- 2023లో కౌన్సిల్‌లో అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వని ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ షాదిక్ బాషా
- సస్పెండ్ చేసిన అప్పటి కమిషనర్ కీర్తి చేకూరి
- ప్రస్తుతం ఆర్వోగా విధులు



కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో వింత పోకడ రాజ్యమేలుతోంది. సస్పెండ్ అయిన ఉద్యోగికి ఎప్పుడూ జీతం వేసిన దాఖలాలు లేవు. ఓ సూపరింటెండెంట్ 2023లో 225 రోజులు సస్పెండ్ అయ్యారు. ఆ కాలాన్ని డ్యూటీ పీరియడ్‌గా చూపిస్తూ సదరు ఉద్యోగికి జీతం వేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇది జరిగిన విషయం..

2023 జూన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ మర్రి అంజలి అప్కాస్ పద్ధతిలో ఎంత మంది ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్నారో పూర్తి వివరాలు ఇవ్వాలని కోరారు. అప్పటి కమిషనర్ కీర్తి చేకూరి స్పందించి వివరాలు ఇవ్వాలని ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ (ప్రస్తుతం ఆర్వో- 2) షాదిక్ బాషాను ఆదేశించారు. అప్పుడు ఆయన కౌన్సిల్‌ను తప్పుదోవ పట్టిస్తూ తప్పుడు నివేదికలు ఇచ్చారు. దీనిపై అప్పటి కమిషనర్ కీర్తి చేకూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. షాదిక్ బాషాను 25-6-2023 నుంచి 4-2-2024 వరకు సస్పెండ్ చేశారు.

చక్రం తిప్పుతున్న కింది స్థాయి ఉద్యోగులు

నగరపాలక సంస్థ పరిధిలోని ఉద్యోగుల మీద చార్జెస్ ఫ్రేమ్ చేయడం, ఇతర డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశిస్తే కింది స్థాయి ఉద్యోగులకు పండగే అన్నమాట. కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను నగరపాలక సంస్థలో కింది స్థాయి ఉద్యోగులు కూడా పాటించరని చెప్పుకోవచ్చు. డెప్యూటీ కమిషనర్ స్థాయి నుంచి ఆపైన అధికారులను ప్రసన్నం చేసుకుంటే ఎంత ఆరోపణలు ఎదుర్కొన్న ఉద్యోగిపై కూడా చర్యలు ఉండవు. షాదిక్ బాషా విషయంలో కింది స్థాయి అధికారులు కమిషనర్‌ను తప్పుదోవ పట్టించారని, సస్పెండ్ అయిన కాలాన్ని డ్యూటీ పీరియడ్‌గా చూపించి జీతం పడేలాగా చేశారనే పలువురు ఉద్యోగులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గతంలో సస్పెండ్ అయిన ఉద్యోగులకు ఎప్పుడూ జీతాలు పడిన దాఖలాలు లేవని అంటున్నారు.

డాక్టర్ రామకృష్ణకు ఉగాది పురస్కారం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరో సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గొల్ల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా డాక్టర్ రామకృష్ణ అవార్డు అందుకోనున్నారు. డాక్టర్ రామకృష్ణ ఆంధ్రా మెడికల్ కాలేజ్ విశాఖపట్నంలో 2012లో న్యూరో సర్జరీ పీజీ వైద్య విద్య పూర్తి చేసి ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. గుంటూరు వైద్య కళాశాలలో 2022 నుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 15 ఏళ్లుగా న్యూరో సర్జన్‌గా సేవలందిస్తున్నారు. బ్రెయిన్, స్పైన్ సర్జరీలు 20వేలకు పైగా విజయవంతంగా చేసి ఎంతో మంది పేదల ప్రాణాలు కాపాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పలు ఉచిత వైద్య శిబిరాలు.. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేసి మన్ననలు పొందుతున్నారు. 2016లో విశాఖపట్నం కేజీహెచ్‌లో, 2020లో విజయవాడ జీజీహెచ్‌లో, 2024లో గుంటూరు జీజీహెచ్‌లో బెస్ట్ డాక్టర్ అవార్డు అందుకున్నారు.



అరకొరగా పాల్గొన్న ముస్లిం సోదరులు

ఇఫ్తార్ విందు అట్టర్ ఫ్లాప్

- తూతూమంత్రంగా నిర్వహణ
- చేతులు దులుపుకున్న జిల్లా అధికారులు
- ఇఫ్తార్ విందుకు రాని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- కనీస సమాచారం లేదంటున్న ముస్లిం సంఘాలు
- వక్ఫ్ సవరణ చట్టం, కూటమి ప్రభుత్వంపై ముస్లింలు గరం గరం
- విందుకు వెళ్లవద్దని ముస్లిం పెద్దలు చెప్పినట్లు సమాచారం

లక్ష్మీపురం: పవిత్రమైన రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు ఉండే ముస్లింలకు జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు గుంటూరు జిల్లాలో అట్టర్ ఫ్లాప్ అయింది. జిల్లాస్థాయి అధికారులు, జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా రాకపోవడంతో తూతూమంత్రంగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారు. పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో నిర్వహించిన విందు గురించి జిల్లా అధికారులు నగరంలోని మసీదులకు కూడా సమాచారం అందించడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇఫ్తార్ విందు బాధ్యతను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో ఓ కింది స్థాయి అధికారికి అప్పగించారు. ఆయన ముస్లిం సంఘాలకు, కూటమి ముస్లిం మైనారిటీ నాయకులకు సమాచారం అందించడంలో పూర్తి నిర్లక్ష్యం వ్యవహరించడంతో విందుకు హాజరుకాలేక పోయారని ముస్లిం మత పెద్దలు అంటున్నారు. ఏటా ఇఫ్తార్‌కు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ, ఆర్‌డీఓ, తహసీల్దార్‌లు, జిల్లా ఎస్పీ, గుంటూరు జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు సహా హాజరయ్యేవారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలతో కలిసి ఇఫ్తార్ చేసుకుని, వారితో పాటే నమాజ్ చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మొట్ట మొదటి రంజాన్ పండుగ మాసంలోనే విందు వెలవెలబోయింది. జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా హాజరు కాలేదు.

కానరాని గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు

ప్రధానంగా గుంటూరు, పశ్చిమ, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గల్లా మాధవి, నసీర్ అహ్మద్‌లు సైతం హాజరుకాక పోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా ప్రభుత్వం నిర్వహించే ఇఫ్తార్ విందుకు హాజరయ్యే ముస్లింలకు అసౌకర్యం కలుగకుండా అధికారులు చూసుకునే వారు. ఈసారి పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. రోడ్డు పైనుంచి వచ్చి, పోయే వారు ఆరగించిన పరిస్థితి నెలకొంది. ఇఫ్తార్ పూర్తయి నమాజ్ అయిన తరువాత గుంటూరు నగర ఇన్‌చార్జ్ మేయర్ షజీలా, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వచ్చి ఇద్దరికి వడ్డించి వెళ్లిపోయారు. కొంతసేపటికి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి వచ్చి వెళ్లిపోయారు.

ముస్లింలు గరం గరం

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం వ్యతిరేకించక పోవడంపై ముస్లిం సంఘాలు మండిపడుతున్నాయి. కూటమి నాయకులు పెదవి విప్పక పోవడంతో ప్రభుత్వం చేపట్టనున్న ఇఫ్తార్ విందులకు ముస్లింలు వెళ్లాల్సిన పని లేదని జిల్లావ్యాప్తంగా ఉన్న మసీదుల్లో చెప్పినట్లు సమాచారం. దీనివల్ల విందు వెలవెలబోయినట్లు సమాచారం.



ఇఫ్తార్ విందులో ఖాళీగా ఉన్న టేబుల్స్

శ్రీ విశ్వావసు.. శుభమస్తు

వసంత మాసం ప్రారంభాన.. లేత చిగురు కొమ్మలపై కుహూ కుహూ అంటూ వినిపించే కోయిలల కమ్మనిగానం.. మామిడి పిందెలు, వేప పువ్వు తదితర షడ్రుచుల కలయికతో తయారయ్యే పచ్చడి నేర్పే జీవిత పాఠం.. రాబోయే ఏడాదిలో జరగబోయే మంచీ, చెడులు, భవిష్యత్తు గురించి చేసే పంచాగ శ్రవణం.. ఇవన్నీ తెలుగువారి ప్రథమ పర్వదినమైన ఉగాది ప్రత్యేకతలు. కొత్త ఆశలు.. కొంగొత్త ఆకాంక్షలతో తెలుగు నూతన ఏడాదికి జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అందరి జీవితాల్లో శుభాలు నింపాలని ఆకాంక్షించారు.

నేడు ఉగాది పర్వదినం

- కొత్త ఆశలతో తెలుగు నూతన సంవత్సరాదికి స్వాగతం
- షడ్రుచుల సంగమం ఉగాది పచ్చడి
- పంచాంగ శ్రవణం తెలుగువారి ప్రత్యేకం



సత్తెనపల్లి: జిల్లా ప్రజలు సంప్రదాయ పద్ధతుల్లో శ్రీ విశ్వావసునామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఉగాది వేడుకలు జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. ఉగాది రోజున కొత్త పనులు ప్రారంభించడం, ఉగాది నాడు పంచాంగ పఠనం నిర్వహించడం ఓ ప్రత్యేకత. తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలు సంస్థలు, దేవస్థానాలు, ప్రముఖులు పండితులతో పంచాంగ పఠనం నిర్వహిస్తారు. జన్మ నక్షత్రం లేదా నామ నక్షత్రం ఆధారంగా వ్యక్తిగత జీవిత అంశాలు, వారి ఆదాయ, వ్యయాలతో పాటు సమాజం, రాష్ట్రం, దేశం పోకడలు, రాజకీయాలు తదితర అంశాలను విశ్లేషిస్తూ పంచాంగ పఠనం చేస్తారు. ఆ సందర్భంగా దాదాపు ప్రతి ఒక్కరూ తమ జాతక ఫలితాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఉగాది వసంత రుతువు ఆగమనం ప్రారంభమైన రోజు. ఈరోజు షడ్రుచులతో చేసిన పచ్చడి తింటారు. ఇక ఆలయాలు, మాధ్యమాల్లో పండితులు వినిపించే పంచాంగానికి పలువురు ప్రాధాన్యత ఇస్తారు.

ఉగాది పచ్చడిలో ఆరోగ్య రహస్యం



ఉగాది పచ్చడి రుచులలో ఒక్కో దానికి ఒక అర్థం ఉంది. ఉప్పు మన జీవితంలో ఆనందం, రుచికి సంకేతంగా పరిగణిస్తారు. పులుపు తెలివిగా వ్యవహరించాల్సిన పరిస్థితులను తెలియజేస్తుంది. చేదు బాధను దిగమింగాలని లేదా భరించాలని సూచిస్తుంది. తీపి సంతోషానికి ప్రతీక. కారం సహనం కోల్పోవడానికి సూచిస్తుంది. పచ్చిమామిడి ముక్కల్లో తగిలే వగరు రుచి కొత్త సవాళ్లను ఎదుర్కోవడం గురించి తెలియజేస్తుంది.

– పి.వెంకటలక్ష్మి, సత్తెనపల్లి

పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం



ఉగాది రోజున పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ ఏడాది వర్షాలు.. ఏ ఏ పంటలు పండే అవకాశం ఉందో తెలుసు కోవచ్చు. ఈరోజు తలంటు స్నానం ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఇష్టదైవాన్ని పూజించాలి. ఆలయాలను దర్శించుకుని ఉగాది పచ్చడి స్వీకరిస్తే మంచి జరుగుతుంది. పంచాంగ శ్రవణం ద్వారా అరిష్టాలు తొలగి శుభదాయకంగా ఉంటుంది. ఉగాది పండుగ రోజే కొత్తదస్త్రాలను రాయడం ప్రారంభించాలి.

–వెలిదండ్ల హనుమత్ స్వామి, పీఠాధిపతి, సత్తెనపల్లి

కొత్త ఆశలు, ఆశయాలకు పునాది



కాలంలో వచ్చే మార్పులకు ఇది నాంది. మోడు వారిన ప్రకృతి చిగురించే కాలం ఇది. జీవితంలో కొత్త ఆశలకు, ఆశయాలకు పునాది ఈ ఉగాది. ఇది తెలుగువారికి విశేషమైన పండుగ. అందుకే కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామికి కూడా ఉగాది ఆస్థానం పేరుతో ఉత్సవం నిర్వహిస్తారు.

– కూనాగు వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి

తెలుగువారికి ప్రధానమైన పండుగ



తెలుగు ప్రజలకు సంవత్సరాది ఉగాది పండగే. రుతువులను అనుసరించి ఈ ఏడాది శ్రీ విశ్వావసు నామ సంవత్సరం. ఉగాది నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కనుక ఇది తెలుగువారి మొదటి పండుగ. ఈరోజు నుంచి వసంత నవరాత్రులు ప్రారంభమవుతాయి. ప్రతీ తెలుగు కుటుంబం ఈ ఉగాది పండుగను విధిగా జరుపుకోవాలి. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంతో అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలి.

–మాదా మల్లికార్జునరావు, అధ్యక్షుడు, అభ్యుదయ విజ్ఞాన సమితి, సత్తెనపల్లి

నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాయిదా

పండుగల అనంతరం నిర్వహణకు చర్యలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ 2025–26 వార్షిక బడ్జెట్ రూ.1534.27కోట్ల ఆమోదానికి ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అధికారులు సభ్యులకు మేసేజ్‌లు పంపారు. అప్పటికే వైఎస్సార్ సీపీ సభ్యులు కౌన్సిల్ హాలుకు వచ్చేఉన్నారు. 12 గంటలు అవుతున్నా సమావేశం ప్రారంభం కాకపోవడంపై కొత్త అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఉగాది, రంజాన్ పండుగల తరువాత ఏర్పాటు చేయాలని డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు కౌన్సిల్ సెక్రటరీ శ్రీనివాస్‌ను కోరారు. తాత్కాలిక మేయర్ షేక్ సజీల 12.01 గంటలకు వచ్చారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే వైఎస్సార్ సీపీ సభ్యులు షేక్ మొహమూద్, అబీద్ బాషాలు మాట్లాడుతూ రంజాన్ పండుగ నేపథ్యంలో నమాజ్ చేసుకునే సమయం దగ్గర పడుతోందని, కౌన్సిల్ సమావేశాన్ని రంజాన్ పండుగ అనంతరం ఏర్పాటు చేయాలని మేయర్‌ను కోరారు. దీనికి మెజార్టీ సభ్యుల ఆమోదంతో మేయర్ సజీల వాయిదా వేశారు. తిరిగి సమావేశం ఎప్పుడు జరిగిందో తెలియజేస్తామని ఆమె చెప్పారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ సభ్యులు

కళారత్న, ఉగాది పురస్కారాలకు పలువురి ఎంపిక

నగరంపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పర్వదినాన బహూకరించనున్న కళారత్న అవార్డుకు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు ఎంపికయ్యారు. డాక్టర్ ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం (నృత్యం), సోమంచి విజయ్‌కుమార్ (పెయింటింగ్), కావూరు సత్యనారాయణ, చిట్టినేని లక్ష్మీనారాయణ (కళలు), డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ (మెడిసిన్ సోషల్ సర్వీస్) చిట్టిపోతు మస్తానయ్య (సోషల్ సర్వీస్), పొత్తూరి రంగారావు (సాంస్కృతిక సేవలు), ఉగాది పురస్కారాలకు డాక్టర్ ఐ.లావణ్య, రాజాహుస్సేన్, రొక్కం కామేశ్వరరావు (అధ్యాపకులు) నల్లక శ్రీనివాసరావు (కళలు) డాక్టర్ గోళ్ల రామకృష్ణ (సహాయ ఆచార్యులు, మెడికల్ కళాశాల) డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మురికిపూడి దేవపాల్ (సామాజిక సేవలు) ఎంపికయ్యారు.

మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా శివరామ్ ప్రసాద్



మంగళగిరి: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ అడ్వకేట్ లంకా శివరామ్ ప్రసాద్ ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ హాలులో శనివారం ఎన్నికలు నిర్వహించారు. శివరామ్ ప్రసాద్ ప్రత్యర్థి దొడ్డక బ్రహ్మానందరావుపై ఆరు ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఎన్నికల అధికారులుగా భాష్యం రంగనాథ్, టి. రోశయ్య, ఆరేగకూటి రామమోహన్‌రెడ్డి వ్యవహరించారు. 155 ఓట్లకు గాను 146 పోల్ అయ్యాయి. ఇందులో శివరామ్ ప్రసాద్‌కు 74 రాగా బ్రహ్మానందరావుకి 68 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షులుగా నవజీవన్ , జనరల్ సెక్రటరీగా కురగంటి రమేష్, జాయింట్ సెక్రటరీగా ఎస్. మురళీకృష్ణ, మహిళా సెక్రటరీగా ఇందిరా ప్రియదర్శిని విజయం సాధించారు.స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా వింజమూరి భారతీదేవి, ట్రెజరర్‌గా టి. నరసింహారావు, లైబ్రరీ సెక్రటరీలుగా ఈమని అశోక్‌రెడ్డి, జి. రామారావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అధ్యక్షుడు శివరామ్ ప్రసాద్‌ను సీనియర్ న్యాయవాదులు వాకా రామ్ గోపాల్ గౌడ్, కోకా వెంకట ప్రసాద్, శృంగారపాటి బాలమురళీకృష్ణ, ఎండీ. షౌకత్‌హుస్సేన్, అంబేద్కర్, గుజ్జర్లపూడి జాన్‌బాబు తదితరులు సత్కరించారు.

దళారుల నుంచి అన్నదాతలను ఆదుకోవాలి

తెనాలి: రబీలో రైతులు సాగుచేసిన జొన్న, మొక్కజొన్న పంటలకు కొనుగోలు కేంద్రాలను తెరిపించి అన్నదాతలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం పరిపాలనాధికారి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డెల్టాలో జొన్న నూర్పిడులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.3,421 కాగా, వ్యాపారులు సిండికేట్‌గా మారి, రూ.1900కే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ.1521 నష్టపోతున్నారని వివరించారు. ప్రభుత్వం మీనమేషాలు లెక్కించకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలను తెరిపించి రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యురాలు ములకా శివకుమారి, పాల రైతుసంఘం నాయకురాలు వేజెండ్ల తబిత పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ఉద్యోగాలు పేరిట టోకరా

- మోసగాడిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- 11 మంది నుంచి రూ. 11లక్షలు వసూలు



రూరల్ స్టేషన్ వద్ద బాధితులు

మంగళగిరి: నగర పరిధిలోని ఎయిమ్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ యువకులకు ఓ మోసగాడు రూ. 11లక్షలకు టోకరా వేసిన ఘటన చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడేపల్లి డోలాస్ నగర్‌కు చెందిన రావూరి నగేష్ ఎయిమ్స్‌కు గ్రావెల్ తోలే టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన గూడూరి ప్రసాద్ అమరావతిలో నివాసముంటూ రిపోర్టర్‌గా చలామణి అవుతున్నాడు. నగేష్, ప్రసాద్‌కు కుటుంబపరంగా పరిచయాలున్నాయి.ఎయిమ్స్‌లో ఉద్యోగాలు ఉన్నాయని, రూ. లక్ష ఇస్తే ఉద్యోగం వస్తుందని ప్రసాద్ నమ్మపలికాడు. దీన్ని నమ్మిన నగేష్ తన ఇంటి చుట్టుపక్కల ఉన్న 10 మంది యువకులతో రూ. 10లక్షలను ఇప్పించాడు. కమీషన్ ఇస్తాననడంతో నమ్మి కట్టించాడు. నగదు చెల్లించి ఏడాది గడుస్తున్నా ప్రసాద్ నుంచి ఎలాంటి సమాధానం లేదు. అడిగితే తాను రిపోర్టర్‌నని, తనను ఎవరు ఏమి చేయలేరని, కేసు పెట్టుకున్నా ఏమీ కాదంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో నగేష్ బాధితులతో కలిసి శనివారం రూరల్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్చరీతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం



అండర్ 13 విభాగంలో విజేతలతో చైర్మన్ విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని: ఆర్చరీ వంటి క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని వీవీఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరులో గల విశ్వ విద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లడుతూ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణకు వీవీఐటీ యూనివర్సిటీ వేదిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ జనరల్ సెక్రటరీ చెరుకూరు సత్యనారాయణ మాట్లాడుతూ 2030లో ఇండియాలో జరగనున్న పారా ఒలింపిక్స్ టోర్నమెంట్‌లో ఆర్చరీలో ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యం ఇవ్వనుందని, అది వీవీఐటీ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం విజేతలకు విద్యాసాగర్ బహుమతులు అందించారు. మార్చి 26 నుంచి 29 వరకూ నాలుగు రోజుల పాటు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో జరిగిన పోటీల్లో పాల్గొనేందుకు దేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 900 మంది ఆర్చరీ క్రీడాకారులు, కోచ్‌లు హాజరయ్యారు. అండర్ 13, అండర్ 15 విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో జార్ఖండ్, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్చర్లు అత్యధికంగా మెడల్స్ సాధించారు. కార్యక్రమంలో ఎకోర్లిస్ ఇండియా సంస్థ సీఈఓ ఏ.వి.పి.ఎస్. చక్రవర్తి, వీవీఐటీయూ డైరెక్టర్ రావెల నవీన్, ఇండియన్ ఆర్చరీ క్రీడాకారుడు కె. వెంకటాద్రి, ఫిజికల్ డైరెక్టర్ ఎస్. అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్మవరం స్టేషన్‌కు పలు రైళ్లు తాత్కాలిక రద్దు

లక్ష్మీపురం: ధర్మవరం స్టేషన్‌లో పలు అభివృద్ధి పనుల నేపథ్యంలో రైలు నంబర్ (17215) మచిలీపట్నం-ధర్మవరం రైలు ఈనెల 31వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు ధర్మవరం స్టేషన్‌కు బదులు అనంతపూర్ స్టేషన్ వరకే ప్రయాణిస్తుందని డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం తెలిపారు. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ (17216) ధర్మవరం-మచిలీపట్నం రైలు ఏప్రిల్ 1 నుంచి మే 1వ తేదీ వరకు అనంతపూర్ స్టేషన్ నుంచి మచిలీపట్నం స్టేషన్‌కు వరకూ ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని ఆయన సూచించారు.

పారా లీగల్ వలంటీర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్. వేదికపై చైర్మన్ రాంబాబు

గుంటూరు లీగల్: పేదలకు న్యాయ సహాయం అందించడంలో పారా లీగల్ వలంటీర్ల పాత్ర కీలకమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, చైర్మన్ పి.వి. రాంబాబు పేర్కొన్నారు. క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శనివారం జిల్లా గుంటూరులో పారా లీగల్ వలంటీర్స్, పర్మినెంట్ లోక్ అదాలత్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ పి.వి.రాంబాబు మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్స్ ప్రాముఖ్యతను వివరించారు. ఏ ఒక్క వ్యక్తీ కూడా సామాజిక, ఆర్థిక అసమానతల కారణంగా న్యాయం పొందకుండా ఉండకూడదన్నారు. సెక్షన్-11 ప్రకారం ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ కావాలంటే వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయాలకు మించకుండా ఉండాలని తెలిపారు. లోక్ అదాలత్‌ల ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేయవచ్చని తెలిపారు.

డీజీపీ కార్యాలయం వద్ద యువకుడి ఆత్మహత్యాయత్నం

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ ఆత్మకూరులోని డీజీపీ కార్యాలయం వద్ద శనివారం ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అతడ్ని స్టేషన్‌కు తీసుకు వచ్చారు. సేకరించిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం ముస్తపల్లి గ్రామానికి చెందిన రమాకాంత్ హైదరాబాద్‌లో కారు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన తల్లి అయిన జాకీర్ లక్ష్మీబాయిపై చిన్నాన్న రాజు పొలం విషయంలో దాడిచేసి విచక్షణారహితంగా కొట్టాడని రమాకాంత్ తెలిపాడు. అక్కడ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పట్టించుకోకపోగా, తనపై రౌడీషీట్ తెరుస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించాడు. నంద్యాల ఎస్పీని సంప్రదించినా తనకు న్యాయం జరగలేదని, అందుకే ఈ ఆత్మహత్యా ప్రయత్నం చేసినట్లు రమాకాంత్ తెలిపాడు.

నేడు ఉపకార వేతనాల ప్రదానోత్సవం



కొరిటిపాడు(గుంటూరు): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రింగ్ రోడ్డులోని శుభం కన్వెన్షన్‌లో ఉపకార వేతనాల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 500 మంది పేద విద్యార్థులకు రూ.30 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్టీ తులసి రామచంద్ర ప్రభు, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, కృష్ణ దేవరాయ పేద, బలహీన వర్గాల సహాయనిధి ట్రస్టీలు నారదాసు శ్రీహరిరావు, అంకిరెడ్డి రంగారావు, తులసి కృష్ణచైతన్య తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలియజేశారు.